# ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్
- పురాణిపేటలో ఏర్పాటు చేసిన దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు

జగిత్యాల టౌన్, అక్టోబర్ 20: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పురాణిపేట్‌లో బొందిలి రాజ్‌పుత్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మికత పెరగడంతో జిల్లా కేంద్రంలో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అమ్మవారి మండపాలు రెండింతలు పెరిగాయన్నారు. అదేవిధంగా అమ్మవారికి సేవ చేసుకునేందుకు భక్తులు వేల సంఖ్యలో దీక్షలు తీసుకున్నారన్నారు. ఒకప్పుడు దసరా అంటే ఆ ఒక్కరోజే పండగలా ఉండేదని, కానీ ఇప్పుడు తొమ్మిది రోజులు దసరా పండగలా కనిపిస్తుందన్నారు. అనంతరం సరస్వతీమాత పూజ నిర్వహించి విద్యార్థులకు ఉచితంగా నోటు బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ శివకేసరిబాబు, భక్తులు పాల్గొన్నారు.

## ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల రూరల్, అక్టోబర్ 20: భారత ప్రభుత్వం కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ, కార్మిక సంక్షేమ అధికారి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరానికి బీడీ కార్మికుల పిల్లలు ఉపకార వేతనాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 1 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఉపకార వేతనాల కోసం నవంబర్ 30వ తేదీలోగా ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ ఇంటర్ ఫస్ట్ ఇయర్ నుంచి డిగ్రీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేది డిసెంబర్ 31 వరకు అని చేసుకోవచ్చని పేర్కొన్నారు.

## బదిలీపై వెళ్తున్న సెర్ప్ సిబ్బందికి సన్మానం



బదిలీపై వెళ్తున్న వారిని సన్మానిస్తున్న అధికారులు. సంఘ సభ్యులు

జగిత్యాల రూరల్, అక్టోబర్ 20: జగిత్యాల రూరల్ మండలంలో టీ సెర్ప్ కమ్యూనిటీ కోఆర్డినేటర్లుగా విధులు నిర్వహించిన సీహెచ్ సంతోష్ కోరుట్లకు, బీ రాజేందర్ కథలాపూర్ మండలానికి బదిలీ కావడంతో శుక్రవారం వారిని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ప్రాజెక్ట్ సంచాలకుడు ఎస్ సుధీర్, డీపీఎం వెంకటేశ్, ఏపీఎం గంగాధర్, సీసీలు గంగారాం, విద్యాసాగర్, రవీందర్, మంగ, సమాఖ్య అధ్యక్షులు సత్తవ్వ, గంగాభవానీ, వీవోఏలు, వీవో అధ్యక్షులు, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు

## రూ.1.50లక్షల నగదు పట్టివేత

### అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు.. పెగడపల్లిలో వాహనాల తనిఖీ

గొల్లపల్లి, అక్టోబర్ 20: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఓ కారులో రూ.1.50 లక్షల నగదు పట్టుబడ్డట్లు అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పెగడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అదనపు ఎస్పీ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఓ కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1.50 లక్షల నగదును పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తన నియమావళిని జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని, నగదు, మద్యం ఉచిత పంపిణీలపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఎవరైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. పోలీస్ సిబ్బంది వాహనాల తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. తనిఖీలో సీఐ కోటేశ్వర్, ఎస్ఐ సతీశ్, సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీలో అంతర్గత కుమ్ములాట



బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన తంగళ్లపల్లి చక్రపాణి, అనుచరులు

వెల్గటూర్, అక్టోబర్ 20: బీజేపీలో జరుగుతున్న అంతర్గత కుమ్ములాట మరోసారి బయటపడింది. ఉమ్మడి వెల్గటూర్ మండలాధ్యక్షుడు తంగళ్లపల్లి చక్రపాణి 50 మంది అనుచరులతో ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఎండపల్లి ప్రెస్‌క్లబ్‌లో ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాస్థాయిలో ఉన్న కొందరు నాయకులు ఒంటెద్దు పోకడలతో వెళ్తున్నారని, సామాన్య కార్యకర్తలను విస్మరిస్తున్నారని తెలిపారు. మండల అధ్యక్షుడినైనా తనకు కూడా పార్టీలో తగిన ప్రాధాన్యత ఇవ్వడంలేదని వాపోయారు. పార్టీలో డబ్బుకు ఉన్న ప్రాధాన్యత కమిట్‌మెంట్‌తో పని చేసే వారికి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ అధిష్టానానికి ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేరని, ఆరేండ్ల నుంచి అసంతృప్తితోనే పార్టీ అధ్యక్షుడిగా పని చేసినట్లు చెప్పారు. త్వరలోనే తాను ఏ పార్టీలో చేరతానో ప్రకటిస్తానన్నారు. రాజీనామా చేసిన వారిలో మండల ఉపాధ్యక్షుడు ఒడిగె రవి, మహిళా అధ్యక్షురాలు గంగుల విజయ, మాజీ సర్పంచ్ భవాని, వార్డు సభ్యులు రజిత, ఇతర నాయకులు సరళ, అమృతమ్మ, ఎల్లయ్య, నర్సయ్య, మెతుకు దశరథం, కాంపెల్లి ప్రశాంత్, లచ్చయ్యతోపాటు తదితరులు ఉన్నారు.

## ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

కొడిమ్యాల, అక్టోబర్ 20: మండలకేంద్రంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన కొడిమ్యాల ప్రీమియం లీగ్(కేపీఎల్) టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. కొండాపూర్ గ్రామానికి చెందిన కందుల రమేశ్ స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా కమల్ సూపర్ కింగ్స్ గెలుపొందగా రూ.20 వేల నగదు బహుమతి అందించారు. టీం భారత్ ద్వితీయ స్థానంలో నిలువగా రూ.10 వేల నగదు అందించారు. విజేతలకు బహుమతులను కందుల రమణారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు ఎర్రోజు మోహనాచారి, రాపర్తి లక్ష్మణ్, డేవిడ్ సన్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదికి ఘన నివాళి

కోరుట్ల, అక్టోబర్ 20: పట్టణానికి చెందిన న్యాయవాది నన్నపనేని శ్రీనివాసరాజు మృతి చెందగా, కోరుట్ల బార్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాది చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోరుట్ల కోర్టు న్యాయమూర్తి అరుణ్ కుమార్, బార్ అసోసియేషన్ సభ్యులు న్యాయవాది శ్రీనివాసరాజు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి బైరి విజయ్, ఉపాధ్యక్షుడు కొంపల్లి సురేశ్, సహాయ కార్యదర్శి సుతారి శ్రీనివాస్, ట్రెజరర్ చిలివేరి రాజశేఖర్, కార్యవర్గ సభ్యుడు తోట ఆంజనేయులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బాపురెడ్డి పరామర్శ



బాధిత కుటుంబసభ్యులను ఓదార్చుతున్న లోక బాపురెడ్డి

కథలాపూర్, అక్టోబర్ 20: దుంపేట గ్రామానికి చెందిన రాధారపు సురేశ్ ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీటీసీ నాగం భూమయ్యతో కలిసి శుక్రవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి వెంట నాయకులు గుండారపు గంగాధర్, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీ, జెల్ల వేణుగోపాల్‌యాదవ్, మిట్టపెల్లి గంగారెడ్డి, భూపెల్లి రాకేశ్, ఉడుగుల ఓంకార్, తీగల మల్లేశం, ఆకుల లక్ష్మీనర్సయ్య, శనిగారపు జలపతి, అల్లకట్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మన్నెగూడెంలో సీఎం కేసీఆర్‌పై బతుకమ్మ పాట

మేడిపల్లి, అక్టోబర్ 20: భీమారం మండలం మన్నెగూడెం గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మహిళలు పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు చెన్నమనేని రవీందర్‌రావు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



నేల స్వభావంపై రైతులకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

## నేల సంరక్షణ, సమగ్ర ఎరువుల పోషక యాజమాన్యంపై శిక్షణ

జగిత్యాల టౌన్, అక్టోబర్ 20: పొలాస ప్రాంతీయ వ్యవసాయ కళాశాలలో నేల సంరక్షణ, సమగ్ర ఎరువుల పోషక యాజమాన్యంపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతి నారాయణభట్ తెలిపారు. ఈ సందర్భంగా నేల ప్రాముఖ్యత, సంరక్షణపై రైతులకు ఆమె సూచనలిచ్చారు. డాక్టర్ జీ వేణుగోపాల్, డాక్టర్ ఎన్ మహేశ్ సమగ్ర ఎరువుల యాజమాన్యం, వరి తర్వాత వివిధ ఆరుతడి పంటల యాజమాన్యం గురించి వివరించారు. డాక్టర్ జీ సాయికుమార్, డాక్టర్ ఎల్లాగౌడ్ డ్రోన్ వాడకం, క్షేత్ర స్థాయిలో దాని మెళకువల గురించి వివరించారు. అనంతరం రైతులు వారి సందేహాలను శాస్త్రవేత్తలతో పంచుకొని నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల మృత్తిక విభాగం ఇన్‌చార్జి డాక్టర్ ఆర్ సాయికుమార్, సహాయ ఆచార్యులు డాక్టర్ జీ వేణుగోపాల్, సేద్య విభాగం డాక్టర్ ఎన్ మహేశ్, డాక్టర్ ఓ సంపత్, టీకే జయన్, కే సురేశ్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలి



రాఘవపట్నంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

గొల్లపల్లి, అక్టోబర్ 20: తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ప్రజలందరికీ వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరాలని గొల్లపల్లి ప్యాక్స్ అధ్యక్షుడు రాజసుమన్ రావు, మండల కో ఆర్డినేటర్ గంగాధర్ కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం రాఘవపట్నంలో గ్రామ అధ్యక్షుడు బుర్ర తిరుపతి గౌడ్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం జరిగింది. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ప్రతి ఇంటికీ చేరాయని, పథకాలను వివరిస్తూ బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరాలని సూచించారు. రాఘవపట్నం గ్రామాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్ దత్తత తీసుకొని అన్ని విధాలా అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. ఇక్కడి ప్రజలపై మంత్రికి నమ్మకం ఎక్కువన్నారు. నవంబర్ 2న ముఖ్యమంత్రి కేసీఆర్ ధర్మపురికి వస్తున్నారని, సమావేశానికి అధిక సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు రమేశ్, ఏఎంసీ వైస్ చైర్మన్ లింగా రెడ్డి, ప్యాక్స్ వైస్ చైర్మన్ తిరుపతి, సర్పంచ్ శంకరయ్య, ఎంపీటీసీ మధుకర్ రెడ్డి, ఉప సర్పంచ్ అంజన్న తదితరులు పాల్గొన్నారు.